# సాక్షి
## తూర్పుగోదావరి

ఆదివారం । 8 । జనవరి । 2023





### నిత్యాన్నదానానికి విరాళం


మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన సంకు సత్య వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు రూ.50,001 విరాళంగా అందించారు.



### రత్నగిరికి సంక్రాంతులు

రత్నగిరికి అధునాతన వెలుగులు ప్రసరించనున్నాయి. స్వామివారి ఆలయంలో ఆధునిక విద్యుత్ పరికరాలు, అండర్ గ్రౌండ్ కేబుల్స్‌తో విద్యుత్తు సరఫరా జరగనుంది. - IIలో▸

### డెల్టాలకు నీరు



రాజమహేంద్రవరం రూరల్: కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం డెల్టా కాలువలకు 9,170 క్యూసెక్కులు విడుదల చేశారు. తూర్పుడెల్టాకు 2,650, మధ్యడెల్టాకు 1,920, పశ్చిమడెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు.

## న్యూస్‌రీల్

### గూటం స్వామికి మద్దూరి పురస్కారం



డాక్టర్ గూటం స్వామి

రాజమహేంద్రవరం రూరల్: కవి, రచయిత, కథకుడు, డా.గూటం స్వామికి మద్దూరి నగేష్ బాబు స్మారక స్ఫూర్తి పురస్కారం ప్రకటించారు. నగేష్ బాబు స్మారక పురస్కార కమిటీ కన్వీనర్ తంగిరాల సోని నుంచి తనకు ఈ మేరకు సమాచారం అందినట్లు స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. తిప్పుడు పొట్లం కవితా సంపుటికి ఈ పురస్కారం లభించిందన్నారు. ఈనెల 10న విజయవాడలో ఠాగూర్ గ్రంథాలయంలో జరిగే కార్యక్రమంలో పురస్కారం అందుకోనున్నట్లు వివరించారు. డా.గూటం స్వామి బొమ్మూరులోని జీపీఆర్ హైస్కూల్‌లో తెలుగు భాషోపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

### నన్నయ ఇన్‌చార్జ్ వీసీగా రేపు బాధ్యతల స్వీకరణ



జీవీఆర్ ప్రసాద్‌రాజు

సాక్షి, రాజమహేంద్రవరం: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీగా జేఎన్‌టీయూ కాకినాడ వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజుకు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు ఉత్తర్వులు వెలువరించిన విషయం తెలిసిందే. కొత్తగా నియమితులైన ప్రసాదరాజు సోమవారం ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆంధ్రా యూనివర్శిటీ జువాలజీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఆచార్య జగన్నాథరావు మూడేళ్ల పాటు నన్నయ వీసీగా వ్యవహరించారు. పదవీ కాలం ముగియడంతో ఆయన తిరిగి తన సొంత డిపార్ట్‌మెంట్‌కు వెళ్లనున్నారు. వీసీగా కొనసాగిన ఎక్కువ సమయం ఆయన వివాదాల్లోనే ఉన్నారు.

### రేపటి నుండి సౌత్‌జోన్ ఖోఖో టోర్నమెంట్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే క్రీడా ప్రాంగణంలో సోమవారం నుంచి ఇండియన్ యూనివర్సిటీ అసోసియేషన్ సహకారంతో సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖో–ఖో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు శనివారం తెలిపారు. టోర్నమెంట్‌కు ఏపీ, తెలంగాణతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలలో 78 యూనివర్సిటీల నుంచి 1200 మంది క్రీడాకారులు, 300 మంది అధికారులు, కోచ్‌లు హాజరవుతున్నారన్నారు. ఈనెల 12 వరకూ పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రారంభం రోజున కాకినాడ ఎంపీ వంగా గీత, మాజీమంత్రి కురసాల కన్నబాబు, శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ రవీంద్రనాథ్‌తో పాటు పలువురు స్పోర్ట్స్ బోర్డు అధికారులు హాజరవుతారన్నారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా స్పోర్ట్స్ కౌన్సెల్ కార్యదర్శి డాక్టర్ శ్యామ్‌కుమార్ వ్యవహరిస్తున్నారన్నారు.

### డాక్టర్ దశరథ రామారెడ్డికి పూర్వ విద్యార్థి గౌరవ పురస్కారం




దశరథ రామారెడ్డికి పురస్కారాన్ని అందజేసి సత్కరిస్తున్న ఎంఆర్ జయరాం

అనపర్తి: హైదరాబాద్ యశోద ఆసుపత్రికి చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ తేతలి దశరథ రామారెడ్డి ఉత్తమ పూర్వ విద్యార్థి గౌరవ పురస్కారాన్ని అందుకున్నారు. బెంగుళూరులోని ఎంఎస్ రామయ్య మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని శనివారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థి అయిన డాక్టర్ దశరథ రామారెడ్డికి కళాశాల అధ్యక్షులు, కులపతి ఎంఆర్ జయరాం ఉత్తమ పూర్వ విద్యార్థి గౌరవ పురస్కారాన్ని అందజేసి దుశ్శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు.

# నేను విన్నాను.. నేను ఉన్నాను...

- మానవత చాటుకున్న ముఖ్యమంత్రి జగన్
- బాధితులకు అండగా ఉంటానని భరోసా
- రాజమహేంద్రవరం పర్యటనలో వినతులకు 4 రోజుల్లోనే పరిష్కారం
- బాధితుల కుటుంబాల్లో ఆనందం



సాయి గణేష్ సమస్యను అడిగి తెలుసుకుంటున్న సీఎం జగన్ (ఫైల్)

సీటీఆర్‌ఐ(రాజమహేంద్రవరం): తమ ప్రియతమ నేత.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తమ కష్టం చెప్పుకుంటే పరిష్కారమవుతుందని వారంతా భావించారు. ఈ నెల 3న రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాలలో పింఛన్ వారోత్సవాలకు వచ్చిన సీఎంకు తమ సమస్యలను నివేదించారు. వారి సమస్యలను విన్న జగన్ వెంటనే స్పందించారు. కలెక్టర్ మాధవీలతను పిలిచి పరిష్కరించాలని ఆదేశించారు. కాన్వాయ్ ఆపించి కిందకు దిగి మరీ సమస్యను విన్నారు. తక్షణమే న్యాయం చేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. సీఎంకు ఇచ్చిన వినతులపై కలెక్టర్ వెంటనే కసరత్తు ప్రారంభించారు. నాలుగు రోజుల వ్యవధిలోనే చకచకా పరిష్కారం చూపారు. బాధితులకు కలెక్టర్ మాధవీలత శనివారం ప్రభుత్వ సాయం అందజేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలు, చెక్కులను, ఉద్యోగ నియామక ఉత్తర్వులను అందజేశారు. తమ కష్టం చెప్పగానే సీఎం స్పందించి పరిష్కారం చూపడంతో బాధిత కుటుంబీకుల కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది.

**రాజమహేంద్రవరం లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన 16 ఏళ్ళ** సాయి గణేష్ కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించడానికి పడుతున్న ఇక్కట్లను సీఎంను కలిసి బాధితుడి తండ్రి వివరించాడు. జగన్ ఆదేశాల మేరకు తక్షణ ఆర్థిక సహాయం కింద రూ.లక్ష కలెక్టర్ అందజేశారు. ప్రతినెలా రూ.5 వేలు పెన్షన్ అందేలా ఉత్తర్వులు జారీ చేశారు.



సాయి గణేష్‌కి చెక్కు అందిస్తున్న కలెక్టర్ మాధవీలత

### మా అబ్బాయి ఆరోగ్యానికి భరోసా

సీఎం జగనన్నను కలిసినప్పుడు మా అబ్బాయి ఆరోగ్యానికి భరోసా ఇచ్చారు. ఆయన చెప్పడంతో కలెక్టర్ రూ.5 వేలు పెన్షన్ సౌకర్యం కల్పించారు. ఆరోగ్యశ్రీ కింద వైద్య సహాయం అందిస్తామన్నారు. ముఖ్యమంత్రికి, కలెక్టర్‌కు కృతజ్ఞతలు.

– గులిన శ్రీ సాయి గణేష్ తండ్రి, లాలాచెరువు



నిడదవోలు శెట్టిపేటకు చెందిన రెండేళ్ల డయానా శాంతి స్పైనల్ మస్క్యులర్ వ్యాధితో బాధపడుతోంది. ఈ బాలిక కష్టం గురించి తెలుసుకున్న సీఎం చలించిపోయారు. ఆయన ఆదేశాల మేరకు బాలిక తల్లి సూర్యకుమారికి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని కలెక్టర్ అందజేశారు. సూర్యకుమారికి నిడదవోలు పీహెచ్‌సీలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం, పాపకి ప్రత్యేక కేటగిరీ కింద నెలకు రూ.5 వేలు పెన్షన్ సౌకర్యం మంజూరు చేశారు.

### సీఎం జగన్‌కు కృతజ్ఞతలు..

మా అమ్మాయి శాంతి వైద్య సహాయం కోసం సీఎం హామీ ఇచ్చారు. కానీ ఇంత తొందరగా ఆ హామీ నేరవేరుస్తారనుకోలేదు. మా కుటుంబ జీవనానికి భరోసా ఇచ్చేలా ఉద్యోగం కూడా ఇచ్చారు. నిడదవోలు మండలంలో ఇంటి స్థలం ఇస్తామన్నారు. సీఎం జగనన్న చల్లగా ఉండాలి.

– సి. సూర్యకుమారి, బాధితురాలి తల్లి, నిడదవోలు



రాజమహేంద్రవరం దేవిచౌక్‌కు చెందిన సిరికొండ దుర్గా సురేష్ కుమార్తె గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. మున్సిపల్ కార్పొరేషన్‌లో దుర్గా సురేష్‌కు ఉన్న చిరుద్యోగం కూడా ఇటీవల పోయింది. ఆయన సీఎం జగన్ దృష్టికి తన సమస్య నివేదించారు. సీఎం ఆదేశాల మేరకు దుర్గా సురేష్‌కు ఆర్ఎంసీలో డ్రైవర్ ఉద్యోగం కల్పిస్తూ పునర్నియామక ఉత్తర్వులు కలెక్టర్ అందచేశారు. పాప ఆరోగ్యం కోసం రూ.లక్ష ఆర్థిక సహాయంతో ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

### పాప ఆరోగ్యానికి ఆర్థిక సాయం

చాలామంది అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం కలుగలేదు. సీఎం జగనన్నను కలిశాను. ఆయన వెంటనే స్పందించి కలెక్టరమ్మకు ఆదేశాలు ఇచ్చారు. ఆమె వెంటనే మనసు పెట్టి మా సమస్యలు పరిష్కరించారు. జగనన్న ఎప్పటికీ ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నాను.

– సిరికొండ దుర్గా సురేష్, రాజమహేంద్రవరం



రాజానగరం నామవరానికి చెందిన కాశాని దుర్గా శ్రీదేవి భర్త గతేడాది మార్చిలో మరణించాడు. ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పిల్లల్ని చదువులు చదివించేందుకు ఆర్థిక భరోసా కల్పించాలని దుర్గా శ్రీదేవి సీఎం జగన్‌ను కలిసి కోరింది. ముఖ్యమంత్రి జగన్ ఆదేశాలతో కడియం మండలం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆమెకు డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఉద్యోగమిస్తూ నియామక ఉత్తర్వులను కలెక్టర్ శనివారం అందజేశారు.

### జగనన్న మాటతోఉద్యోగం వచ్చింది...

3వ తేదీన ముఖ్యమంత్రి జగనన్నను కలిసే అదృష్టం వచ్చింది. నాకు కష్టాలను చెప్పాను. పెద్ద మనసుతో ముఖ్యమంత్రి జగనన్న స్పందించారు. ఇంత త్వరగా నాకు ఉద్యోగం వస్తుందని కలలో కూడా అనుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాను.

– కాశాని దుర్గా శ్రీదేవి, నామవరం



రాజమహేంద్రవరం చర్చిపేటకు చెందిన క్రిస్టఫర్ 25 సంవత్సరాలుగా ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేస్తూనే ఉన్నారు. ముఖ్యమంత్రి వస్తున్నారని తెలిసి ఇటీవల కలిశారు. సీఎం తెలుసుకుని న్యాయం చేయాలని ఆదేశించారు. వెలుగుబంద జగనన్న కాలనీలో ప్లాట్ నంబర్ 53లో 77 చదరపు గజాల స్థలానికి చెందిన పట్టాను కలెక్టర్ మాధవీలత అందచేశారు.

### జగనన్న మనసున్న మారాజు...

ఒంటరిగా ఉంటున్న నాకు గతంలో ఎవరూ ఇంటి స్థలం ఇవ్వలేదు. జగనన్నను కలిసి కష్టం చెప్పుకున్నాను. ఆయన అంతా విన్నారు. ఇంటి స్థలమిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెళ్లిన వెంటనే నాకు ఇంటి స్థలం వస్తుందని అనుకోలేదు. ముఖ్యమంత్రి జగనన్నకు ధన్యవాదాలు.

– కె. క్రిస్టఫర్, రాజమహేంద్రవరం



జర్నల్‌ను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య జగన్నాథరావు

## 'నన్నయ విజ్ఞాన భారతి' జర్నల్ ప్రారంభోత్సవం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ 'నన్నయ విజ్ఞాన భారతి' పేరిట సైన్స్ అండ్ టెక్నాలజీ జర్నల్‌ని వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావు శనివారం ప్రారంభించి, తొలి సంచికను విడుదల చేశారు. ఈ జర్నల్‌కు ఎడిటర్ ఇన్ చీఫ్‌గా వ్యవహరిస్తున్న ఆయన ఇందుకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. దీనిలో ప్రధానంగా సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి ఎనిమిది జర్నల్స్ ఉన్నాయి. నెట్‌వర్క్, సైబర్ సెక్యూరిటీ, పైథాన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అనేక అప్‌డేటెడ్ అంశాలపై పేపర్స్‌ని ప్రచురిస్తారు. శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన మరిన్ని 'నన్నయ విజ్ఞాన భారతి' ద్వారా ప్రచురించాలని ఆకాంక్షను వెలిబుచ్చారు. దీనికి ఎడిటోరియల్ బోర్డు సభ్యులుగా వీసీతోపాటు ఆచార్య పి. సురేష్‌వర్మ, ఆచార్య వై. శ్రీనివాసరావు, డాక్టర్ ఎ. మట్టారెడ్డి, ఆచార్య కె. రమణేశ్వరి, డాక్టర్ వి.పెర్సిస్, డాక్టర్ ఎం .కమలకుమారి, డాక్టర్ కె.వెంకటాచార్యస్వామి, డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ పి.విజయనిర్మల ఉంటారు.

## 'నన్నయ' వీసీకి ఘనంగా వీడ్కోలు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రగతికి ప్రధానంగా పేర్కొనే 'నాక్' బి ప్లస్ గుర్తింపును తన హయాంలో సాధించటం సంతోషంగా ఉందని ఉపకులపతి ఆచార్య ఎం. జగన్నాథరావు అన్నారు. సమష్టి సహకారంతోనే నాక్ గుర్తింపుతో పాటు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌కు ఏఐసీటీఈ, ఐఎస్ఓ గుర్తింపులను కూడా సాధించగలిగామన్నారు.

వీసీగా శనివారం నాటితో పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న ఆయనకు కన్వెన్షన్ సెంటర్‌లో సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. మూడేళ్ల పదవీ కాలంలో కరోనా వైరస్ ప్రభావంతో కొంత గందరగోళ పరిస్థితులు ఏర్పడినా ఆన్‌లైన్ సేవల ద్వారా అత్యధికంగా వెబినార్లు నిర్వహించి లిమ్కా, ఇండియా బుక్స్ ఆఫ్ రికార్డ్స్‌ని పొందగలిగామన్నారు.

ఇప్పటికే తెలుగు రాష్ట్రాలలో పెద్ద యూనివర్సిటీగా ఉన్న 'నన్నయ'కు ఉజ్వలమైన భవిష్యత్తు ఉందన్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లకు చెందిన సిబ్బందితో పాటు గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఆచార్య జగన్నాథరావు సేవలను కొనియాడారు. పుష్పగుచ్ఛాలు, పూలదండలు, శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు.




ఆచార్య జగన్నాథరావును సన్మానిస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది

## సంక్షేమ పథకాలపై ఓర్వలేనితనం

### విపక్షాల వైఖరిపై ఎంపీ మార్గాని భరత్‌రామ్ ధ్వజం



కొత్తగా పెన్షన్ పొందిన లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న ఎంపీ మార్గాని భరత్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ తదితరులు

కడియం: పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. కడియంలో శనివారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. దీనికి ఎంపీతో పాటు జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, వైఎస్సార్‌సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ హాజరయ్యారు. 456 మందికి కొత్తగా మంజూరైన పెన్షన్లను భరత్ అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపీ మాట్లాడుతూ గతంలో ఆదాయం, అదే బడ్జెట్ ఉన్నప్పటికీ చంద్రబాబునాయుడు ప్రజలకు మేలు చేయలేకపోయారన్నారు. కరోనా వంటి పరిస్థితుల్లో కూడా సీఎం జగన్ అన్ని పథకాలనూ అమలు చేశారన్నారు. ధరల పెంపుపై ప్రతిపక్షాలు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ అంశం కేంద్రం చేతిలో ఉంటుందని గుర్తించాలన్నారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తోందన్నారు. ఈ స్థాయిలో పథకాలు అమలు చేస్తున్న సీఎంకు మద్దతుగా నిలవాలని ఆయన ప్రజలను కోరారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ ప్రతినెలా మొదటి రోజే వలంటీర్ లబ్ధిదారుల ఇంటికి వచ్చి పెన్షన్లు అందించడం సాధారణ విషయం కాదన్నారు. గత ప్రభుత్వం దిగిపోవడానికి రెండు నెలల ముందు పెన్షన్ పెంచిందన్నారు. కానీ జగన్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతోందన్నారు. కడియం మండలంలో 11,497 మందికి రూ.3.5 కోట్లకు పైగా ప్రతినెలా పెన్షన్లు అందిస్తున్నామన్నారు. పార్టీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) మాట్లాడుతూ పథకాల అమలు విషయంలో జగన్‌కు ఎవరూ సాటి రారన్నారు. సభకు మండల పార్టీ అధ్యక్షులు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ అధ్యక్షత వహించారు. శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, దుళ్ళ సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కుప్పం వెళ్లొద్దు బాబూ..

మంత్రి దాడిశెట్టి రాజా



మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: సంక్రాంతి పండగ ప్రశాంతంగా జరుపుకోవాలంటే చంద్రబాబు కుప్పం నియోజకవర్గానికి రాకూడదని ప్రజలు కోరుకుంటున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. శనివారం తుని పట్టణంలో జరిగిన సంక్రాంతి సంబరాలకు హాజరైన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్కడి ప్రజలు పంటలు పండి సంతోషంగా ఉన్నారని, ప్రచారం కోసం చంద్రబాబు పర్యటనకు వస్తున్నారంటే భయపడుతున్నారన్నారు. కందుకూరు, గుంటూరు జిల్లాల్లో జరిగిన చంద్రబాబు రోడ్ షో 11 మంది అమాయకుల ప్రాణాలను బలిగొందన్నారు. కుప్పం పర్యటనకు వస్తే ప్రశాంతత ఉండదని ప్రజలు భయపడుతున్నారన్నారు. ప్రజల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు వ్యవహరించాలని హితవుపలికారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టవద్దని సూచించారు. రాష్ట్రంలో ప్రజలంతా ఆనందంగా పండగ జరుపుకొనేందుకు సమాయత్తం అవుతున్నారని, టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా విద్వేషాలను సృష్టించి పైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు.

### పేకాట శిబిరంపై దాడి

ఐ.పోలవరం: పశువుల్లంక శివారు గోదావరి తిప్పపై పేకాటాడుతున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు ఎస్సై ఎస్.రాజేష్ సిబ్బందితో కలసి దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకుని, రూ.2.87 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



# రత్నగిరికి సంక్రాంతులు



స్వర్ణకాంతితో ప్రకాశిస్తున్న తూర్పు రాజగోపురం



రత్నగిరి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కొత్త జనరేటర్లు

- నిరాటంకంగా విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు
- రూ.1.60 కోట్లతో అభివృద్ధి పనులు

అన్నవరం: రత్నగిరికి కొత్త కాంతులొస్తున్నాయి.. అధునాతన వెలుగులు ప్రసరించనున్నాయి.. అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామివారి ఆలయంలో ఆధునిక విద్యుత్ పరికరాలు, అండర్ గ్రౌండ్ కేబుల్స్‌తో నిరాటంకంగా విద్యుత్తు సరఫరా జరుగనుంది. దీనికోసం రూ.1.60 కోట్లతో రెండు జనరేటర్లు అదనంగా ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ నిలిచిపోతే కేవలం 40 సెకన్లలో జనరేటర్ల ద్వారా విద్యుత్ సరఫరా అయ్యేలా పవర్ హౌస్‌లను ఆధునీకరిస్తున్నట్లు దేవస్థానం ఎలక్ట్రికల్ డీఈ టి.సూర్యనారాయణ శనివారం 'సాక్షి'కి తెలిపారు. రత్నగిరిపై స్వామివారి ఆలయం, వ్రత మండపాలు, కల్యాణ మండపం, ఇతర కార్యాలయాలకు విద్యుత్ సరఫరాకు అండర్ గ్రౌండ్ కేబుళ్లు వేస్తున్నామని వివరించారు.

**రత్నగిరి, సత్యగిరి పవర్ హౌస్‌లలో..**

రత్నగిరి, సత్యగిరి, కొండ దిగువన దేవస్థానానికి మూడు పవర్ హౌస్‌లు ఉన్నాయి. ఇందులో రత్నగిరిపై సీఆర్వో ఆఫీస్ పక్కన పవర్‌హౌస్‌లో 250 కేవీ, 500 కేవీ విద్యుత్తు జనరేటర్లు ఉన్నాయి. వీటికి తోడు 380 కేవీ విద్యుత్ జనరేటర్ ఏర్పాటు చేశారు. సత్యగిరి పవర్‌హౌస్‌లో ప్రస్తుతం 320 కేవీ జనరేటర్లు రెండు ఉండగా, అదనంగా 380 కేవీ జనరేటర్ అందుబాటులోకి రానుంది. రత్నగిరి పవర్‌హౌస్‌లో కొత్త జనరేటర్ల ఏర్పాటు శనివారంతో పూర్తయిందని డీఈ తెలిపారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ సత్యనారాయణ మూర్తి ఆదేశాల మేరకు దేవస్థానానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే మొదట 250 కేవీ జనరేటర్ ఆన్ అవుతుంది. దాని కెపాసిటీ చాలకపోతే 380 కేవీ, ఆ కెపాసిటీ కూడా చాలకపోతే 500 కేవీ జనరేటర్స్ ఆన్ అవుతాయి.

**త్వరలో సబ్‌స్టేషన్ నిర్మాణం**

స్వామివారి దేవస్థానానికి మరింత నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడానికి రత్నగిరిపై రూ.ఐదు కోట్లతో ఇన్‌డోర్ 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను నిర్మించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సీఆర్వో ఆఫీస్ పక్కన 1,048 గజాల స్థలాన్ని దేవస్థానం సమకూర్చుతోంది. రాష్ట్ర ప్రభుత్వ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) దీనిని నిర్మిస్తోంది.

### సంక్రాంతి నాటికి వెలుగులు



ఈ సంక్రాంతికి రత్నగిరిపై కొత్త వెలుగులు ప్రకాశించాలనే ఉద్దేశంతో పనిచేస్తున్నాం. విద్యుత్ జనరేటర్లు అమర్చే పని పూర్తయ్యింది. అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసే పనులు చురుగ్గా జరుగుతున్నాయి. న్యూసీసీ సత్రంపై శంఖు, చక్రం, నామం ఏర్పాటు చేసే పనులు చేపట్టాం. రెండు రాజగోపురాలు బంగారు రంగు దీపాల వెలుగులో ప్రకాశించేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశాం. తూర్పు రాజగోపురం మెట్లకు కూడా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నాం.

– సూర్యనారాయణ, దేవస్థానం ఎలక్ట్రికల్ డీఈ

# లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభం



షాపింగ్ మాల్‌లో పట్టు చీరలను పరిశీలిస్తున్న సినీ తారలు అనసూయ, నేహాశెట్టి

### పెద్దాపురంలో సినీతారల సందడి



జ్యోతిప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభిస్తున్న దొరబాబు, మట్టే శ్రీనివాస్

పెద్దాపురం: స్థానిక దర్గా సెంటర్‌లో లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో శనివారం సినీ తారలు సందడి చేశారు. అనసూయ (జబర్దస్త్ ఫేమ్), నేహాశెట్టి (డీజేటిల్లు ఫేమ్)ల చేతుల మీదుగా ఈ మాల్ ప్రారంభించారు. తొలుత షాపింగ్ మాల్ అధినేతలు శ్రీను, రత్తయ్య, స్వామి ఆధ్వర్యంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు మట్టే సత్యప్రసాద్, మట్టే శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ తదితరులు మాల్‌ను సందర్శించి మాట్లాడారు. లక్కీ షాపింగ్ మాల్ బ్రాంచ్ పెద్దాపురంలో ఏర్పాటు చేయడం పట్టణాభివృద్ధికి శుభసూచికమన్నారు. తక్కువ ధరకే నాణ్యమైన వస్త్రాలను అందించడం మంచి పరిణామమన్నారు. అనంతరం సినీతారలు అనసూయ, నేహాశెట్టి మాల్ వద్దకు వచ్చేసరికి అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వస్త్ర ప్రపంచంలో లక్కీ షాపింగ్ మాల్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అటువంటి నాణ్యత, అద్భుతమైన షాపింగ్ అనుభూతినందించే సువిశాలమైన షోరూమ్ ఇక్కడ ఏర్పాటు చేయడం అభినందనీయమని అనసూయ, నేహాశెట్టి అన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బిల్డింగ్ యజమాని గోమాడ సూరిబాబు, కంకటాల ఎండీ కంకటాల మల్లిక్, వార్డు కౌన్సిలర్ విడదాసరి రాజా, వైఎస్సార్ సీపీ నాయకులు గోపు మురళి, కనపర్తి చీమదొర, టీడీపీ నాయకులు బొడ్డు బంగారుబాబు, తూతిక రాజు, నాళం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆరేళ్లుగా నక్కి.. ఆఖరికి చిక్కి

### హత్య కేసులో నిందితుడి అరెస్ట్



అరెస్టు చేసిన నిందితుడిని హాజరుపరిచిన ఇన్‌స్పెక్టర్ మధుబాబు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సహజీవనం చేస్తున్న మహిళను హత్య చేసిన కేసులో ఆరేళ్లుగా పరారీలో ఉన్న రాజమహేంద్రవరం సుబ్బారావునగర్‌కు చెందిన తొండవు నాగప్రసాద్(ప్రసాద్)ను శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ జి.మధుబాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం రామన్నపాలేనికి చెందిన పేరుబోయిన శివభవాని (మృతురాలు) 2008లో మొదటిభర్త చనిపోవడంతో కుమార్తెను తీసుకుని బతుకుతెరువు నిమిత్తం రాజమహేంద్రవరం వచ్చింది. ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులు, రోగులకు సేవలందిస్తూ వారిచ్చే డబ్బులతో తన కుమార్తెతో కలసి జీవిస్తుండేది. శివభవానికి కార్ డ్రైవర్ తొండవు నాగప్రసాద్‌తో పరిచయం ఏర్పడింది. నాగప్రసాద్ భార్యకు ఓ ప్రమాదంలో మతిస్థిమితం పోయింది. దీంతో 2014 నుంచి శివభవాని, తన కుమార్తెతో కలసి నాగప్రసాద్ ఇంట్లోనే కాపురం ఉన్నారు. అనంతరం ఆ ఇల్లు అమ్మేయడంతో పక్కనే ఉన్న సంజీవయ్యనగర్‌లో అద్దెకు వెళ్లారు. 2017 మార్చి 2న శివభవాని ఇంట్లో మృతి చెంది ఉంది. మృతురాలి తల్లి పేరుబోయిన కొవ్వాడమ్మ, బంధువులు వచ్చి చూడగా శివభవాని పీకకోసి ఉంది. ముందురోజు తమకు గొడవ జరగడంతో ఆమె పీక కోసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని నాగప్రసాద్ అందరినీ నమ్మించాడు. దీంతో బంధువులు శివభవాని మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువెళ్లి దహన సంస్కారాలు జరిపించారు. అంత్యక్రియలు పూర్తయిన రెండు వారాల తరువాత మృతురాలి సోదరుడు వెంకటేష్‌కు నాగప్రసాద్ ఫోన్ చేసి మీచెల్లి తనకు తానుగా పీక కోసుకుని ఆత్మహత్య చేసుకోలేదని, తరచూ డబ్బులు కోసం వేధిస్తుందని అందుకే తానే చంపేశానని తెలిపాడు. దీంతో ఈ విషయమై 21 రోజుల అనంతరం మృతురాలి తల్లి కొవ్వాడమ్మ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రామకోటేశ్వరరావు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నాగప్రసాద్ పరారీలో ఉండగా, ప్రస్తుత త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ జి.మధుబాబు, సెంట్రల్ జోన్ డీఎస్పీ జేవీ సంతోష్ పర్యవేక్షణలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడిని అరెస్టు చేశారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన త్రీటౌన్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్స్ బీఎంవీవీ భానుమూర్తి, జె.సుబ్బారావు, క్రైమ్ కానిస్టేబుళ్లు కె.వెంకటేశ్వరరావు, బి.విజయకుమార్‌లను సెంట్రల్ జోన్ డీఎస్పీ జేవీ సంతోష్ అభినందించారు.

# పొట్టకూటికి వచ్చి పరలోకాలకు..

### ఇద్దరు మత్స్యకారుల మృతి



ఘటనా స్థలంలో మృతదేహాలు

కిర్లంపూడి: కాయకష్టం చేసుకుని జీవించే కుటుంబాలు వారికి.. పొట్టకూటి కోసం ఊరుకాని ఊరు వచ్చారు. చెరువు ఊబిలో చిక్కి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు.. ఈ ఘటనతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బూరుగుపూడి గ్రామంలోని దుశ్లామ్ చెరువులో చేపలు పట్టేందుకు కృష్ణా జిల్లా నుంచి 70 మంది శనివారం వచ్చారు. వీరు చేపలు పట్టేందుకు వలతో సిద్ధమై చెరువులోకి దిగారు. ఇందులో తిప్పగ్రామం (ఉర్లగొంది)కి చెందిన తిరుమారి సత్యనారాయణ (41), బస్వాని సత్యనారాయణ (55) బురదలో కూరుకుపోయారు. వెంటనే సహచరులు గురించి కేకలు వేశారు. అప్పటికే వారు గల్లంతయ్యారు. ఈ విషయమై కిర్లంపూడి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై బి.తిరుపతిరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. చెరువు అడుగు భాగాన బురదలో కూరుకుపోయిన తిరుమారి సత్యనారాయణ, బి.సత్యనారాయణ మృతదేహాలను వెలికితీశారు. ఇదిలా ఉంటే బస్వాని సత్యనారాయణకు భార్యతో పాటు అమ్మాయి, అబ్బాయి ఉన్నాయి. తిరుమారి సత్యనారాయణకు భార్య, పాప ఉన్నారు. ఈ కుటుంబాలకు వీరే పెద్ద దిక్కు. సంఘటనా స్థలాన్ని సీఐ సూర్యఅప్పారావు పరిశీలించారు.

## క్లుప్తంగా

### రంపయర్రంపాలెం వెళ్లి పింఛను అందజేత


నాగదేవికి పింఛను అందజేస్తున్న వలంటీర్

కడియం: వేమగిరికి చెందిన గుత్తుల నాగదేవి (దివ్యాంగ పింఛను) డెలివరీ నిమిత్తం గోకవరం మండలం రంపయర్రంపాలెంలో తన అమ్మగారి ఇంటికి వెళ్లడంతో గ్రామ వలంటీర్ కాకులపాటి సోమరాజు శనివారం అక్కడికి వెళ్లి పింఛను అందజేశారు.

### ట్రై సైకిళ్ల పంపిణీ

కడియం: పొట్టిలంకకు చెందిన ముగ్గురు దివ్యాంగులకు తదేకం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రై సైకిళ్లను శనివారం అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా జనసేన అధ్యక్షుడిజీ కందుల దుర్గేష్ చేతుల మీదుగా వీటిని అందించారు.

### బీసీ హాస్టళ్ల తనిఖీ


బీసీ హాస్టల్ పరిశీలిస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక వై.జంక్షన్ బీసీ బాలుర వసతి గృహాన్ని స్థానిక నాయకులతో కలిసి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ శనివారం తనిఖీ చేశారు. హాస్టల్లో సదుపాయాలు, పరిస్థితులపై ఆరా తీశారు. విద్యార్థుల హాజరు పట్టిక, ఆహార మెనూ, నీటివసతి, మరుగుదొడ్లు, శానిటైజేషన్ తదితర వాటిని పరిశీలించారు. బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరామ్, జోనల్ ఇన్‌చార్జి కురగంటి సతీష్ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు పిల్లాడి రుద్రయ్య, నందివాడ సత్యనారాయణ, రుక్మాంధర రావు తదితరులు పాల్గొన్నారు.

### బైరి నరేష్‌ను శిక్షించాలి

ప్రకాశం నగర్: అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలంగాణకు చెందిన బైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అయ్యప్ప భక్త సమాజం ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులు శనివారం సాయంత్రం నగరంలో నిరసన ప్రదర్శన, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీ వీఎల్‌పురం వినాయకుడి గుడి నుంచి బయలుదేరి ఆర్టీసీ కాంప్లెక్స్, స్టేడియం రోడ్డు మీదుగా గౌతమ ఘాట్ సమీపంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్దకు చేరుకుని హిందూ వ్యతిరేక తీవ్రవాది నరేష్‌పై పీడీ యాక్టు నమోదు చేయాలని, హిందూ ధర్మాన్ని రక్షించాలని నినాదాలు చేశారు. గురుస్వాములు మాట్లాడుతూ హిందూ దేవుళ్లను, భక్తులను కించపరిచేలా మాట్లాడే వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

### జేగురుపాడులో పర్యటన

కడియం: జేగురుపాడులో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శనివారం పర్యటించారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, పార్టీ నాయకులు వెలుగుబంటి రఘురామ్, మార్గాని సత్యనారాయణ, పితాని శివరామకృష్ణ, పాతూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర భవిష్యత్తు టీడీపీతోనే

సీటీఆర్ఐ: రాష్ట్రంలో నిరంకుశ పాలన కారణం రాష్ట్రాభివృద్ధి 20 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లిపోయిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 21వ డివిజన్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం జరిగింది. డివిజన్లోని ఇంటింటికీ వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

# ముురిపింఛెన్

- నూతన పింఛన్లతో లబ్ధిదారుల హర్షం
- అర్బన్ పరిధిలో 1453 మందికి కొత్తగా అందజేత
- ముగిసిన పింఛను వారోత్సవాలు

సీటీఆర్ఐ: పింఛను పెంపుతో పాటు కొత్త పింఛనులు మంజూరైన లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్లు పొందాలంటే ఎన్నో అగచాట్లు పడేవారు. అది కూడా అరకొరగా ఇచ్చేవారు. కాని నేడు పింఛన్లు పొందాలంటే ఎటువంటి సిపారసులు అక్కర్లేదు. వారి గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే చాలు అర్హత ఉన్నవారికి పింఛన్లు నేరుగా వారి ఇంటి వద్దకే వస్తాయి. అర్హులైన వారు ఏ ఒక్కరూ పింఛను రాలేదని బాధపడకూడదని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంవత్సరంలో రెండు సార్లు పింఛన్‌ను నమోదు కార్యక్రమం చేపట్టుతున్నారు. అర్హత ఉన్న వారికి నూతన పింఛన్లు అందిస్తున్నారు. దానిలో భాగంగానే జనవరి 1 నుంచి కొత్త పింఛన్లు లబ్ధిదారులకు అందిస్తున్నారు. శనివారంతో పింఛను వారోత్సవాలు ముగిశాయి. రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో 29,698 మంది లబ్ధిదారులున్నారు. వీరి కోసం ప్రభుత్వం రూ.7,40,24,500 నగదును విడుదల చేస్తోంది. పాత పింఛనుదారులతో పాటు మరో 1453 మంది అర్హత ఉన్న వారికి అదనంగా పింఛనును మంజూరు చేసింది. దీంతో లబ్ధిదారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.


పిన్నమరాజు పద్మరాజుకు కొత్త పింఛను అందిస్తున్న ఎంపీ భరత్ తదితరులు

**సదరం సర్టిఫికెట్ సవరణతో..**



42వ డివిజన్‌లోని సుభాష్ నగర్‌లో ఉంటున్న చిన్నారి మోర్తభాను ప్రకాష్‌కి సదరం సర్టిఫికెట్ లేకపోవడంతో వికలాంగ పింఛను రాలేదు. దీంతో వార్డు సచివాలయం సిబ్బంది సదరన్ సర్టిఫికెట్ ఏర్పాటు చేసి, పింఛనుకు దరఖాస్తు చేశారు. దరఖాస్తు చేసిన వెంటనే పింఛను మంజూరైంది. తల్లి సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

**రేషన్ కార్డు సరవణతో..**



నా భర్త చనిపోయిన ఆయన పేరు రేషన్ కార్డులో ఉండిపోవడంతో నాకు పింఛను రాలేదు. సచివాలయ సిబ్బందిని కలవడంతో వారు నా భర్త పేరును కార్డు నుంచి తొలగించి నాకు పింఛను మంజూరు అయ్యేలా చేశారు. దీంతో నాకు ఈ నెల కొత్త పింఛను వచ్చింది.
– సరస్వతి, వితంతు పింఛను, 84వ సచివాలయం

**విద్యుత్ బిల్లు ఎక్కువ నమోదు కావడంతో...**



నాకు వృద్ధాప్య పింఛను వచ్చేది. అయితే మా విద్యుత్ బిల్లులో అధికంగా బిల్లు నమోదు కావడంతో నాకు పింఛను ఆగిపోయింది. తిరిగి నాకు సవరించిన బిల్లుతో దరఖాస్తు చేసుకోవడంతో నాకు పింఛను తిరిగి పునరుద్ధరించారు. సంతోషంగా ఉంది.
– మందేల శ్రీరాములు, 90 సచివాలయం

**నా కొడుకుకు ఉద్యోగం ఉందనీ...**



నా కుమారుడుకి ప్రభుత్వ ఉద్యోగం ఉండడంతో నేను పింఛను పొందడానికి అనర్హులను అయ్యాను. నేను స్పందనలో దరఖాస్తు చేసుకోవడంతో నాకు తిరిగి పింఛను కోసం దరఖాస్తు చేసుకోమన్నారు. దీంతో నాకు కొత్త పింఛను మంజూరైంది.
– నారాయణమ్మ, కొత్త పింఛను లబ్ధిదారిని

## వెంకన్నబాబు స్వామిజీకి డాక్టరేట్


డాక్టరేట్‌ను అందుకుంటున్న చిన్నవెంకన్నబాబు స్వామిజీ

సీటీఆర్ఐ: జ్యోతిష, సామాజిక రంగాల్లో అందించిన సేవలను గుర్తిస్తూ గాడాలలోని శ్రీమహాలక్ష్మి సమేత చినవేంకటేశ్వర స్వామివారి పీఠాధిపతి శ్రీమాన్ చిన్న వెంకన్నబాబు స్వామిజీకి ఇంటర్నేషనల్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్ గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది. మహాలక్ష్మి అమ్మవారి ఉపాసకులైన చిన్న వెంకన్నబాబు ప్రశ్న శాస్త్ర పరంగా జ్యోతిష పరిష్కారాలను సూచించడంలో ప్రఖ్యాతి పొందారు. శనివారం బెంగళూరులోని పాయ్ వైస్రాయ్‌లో అనేక మంది ప్రముఖుల సమక్షంలో ఈ గౌరవ డాక్టరేట్‌ని అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక జయశ్రీ గార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో ఉభయ రాష్ట్రాల చైర్మన్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో స్వామిజీ వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా సమితి కార్యవర్గం, సభ్యులు, సర్వేజనా సుఖినోభవంతు చారిటబుల్ ట్రస్టు వైస్ చైర్ పర్సన్, మన గుడి, మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవాసమితి జాతీయ చైర్ పెర్సన్ ధరణికోట దుర్గ వెంకట హేమావతి, అంబటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి చర్యలు

- రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- దుళ్లలో గడపగడపకూ మన ప్రభుత్వం

కడియం: గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. దుళ్లలో మూడో రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చందన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించడం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించడం, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకోవడంలో భాగంగా సీఎం జగన్ ఆదేశాల మేరకు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గుర్తించిన ప్రతి సమస్యను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు. దుళ్ల ఎస్సీ పేట ఏరియాలో స్థానికులు డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు తదితర సమస్యలను కో ఆర్డినేటర్ చందన దృష్టికి తీసుకువచ్చారు. వాటిని పరిష్కరించాల్సిందిగా అధికారులను చందన ఆదేశించారు. ముందుగా వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల పార్టీ అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, మండల బూత్ కమిటీ కన్వీనర్ తాడాల చక్రవర్తి, దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, ఎంపీటీసీ కట్టుంగ నాగరాజు, నర్సరీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి శివాజీ తదితరులు పాల్గొన్నారు.


దుళ్లలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

## హుకుంపేట సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(సొసైటీ) నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌లు వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో సంఘ చైర్ పర్సన్ బొప్పన సుబ్బారావు, పర్సన్ చీరా రాజు, సంఘ సీఈవో బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## వలంటీర్లకు జూట్ బ్యాగ్‌ల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ పింఛన్ల కానుక పెంపు వారోత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం 14వ డివిజన్ 33వ సచివాలయంలో డివిజన్ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ సుధారాణి, వైఎస్సార్ సీపీ నగర సెక్రటరీ పెంకే సురేష్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్మిన్ కళాధర్ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ప్లాస్టిక్ నియంత్రణను ఇప్పటి నుంచే ప్రారంభించే లక్ష్యంతో స్వచ్ఛ సంకల్పం పేరుతో వలంటీర్లకు జ్యూట్ బ్యాగ్‌ల పంపిణీ చేశామన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు వలంటీర్లు వద్ద నుంచే మొదలవుతుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామని సురేష్ పేర్కొన్నారు. డివిజన్‌లోని సెక్రెటరీ, వలంటీర్లకు బ్యాగ్‌లు అందించారు.

# అందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చే బాధ్యత నాదే


నగరంలో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎంపీ భరత్ రామ్

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- నగరంలో గడపగడపకూ మన ప్రభుత్వం

రాజమహేంద్రవరం సిటీ: రెండు నెలల్లో అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలు అందించే బాధ్యత నాదేనని ఎంపీ మార్గాని భరత్‌రామ్ హామీ ఇచ్చారు. శనివారం నగరంలోని 47వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చోడిశెట్టి సత్యవాణి నేతృత్వంలో క్వారీ మార్కెట్ సెంటర్ సారంగధర మెట్ట ప్రాంతంలో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగనన్న అందించిన పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా చాలా మంది ఇళ్ల పట్టాల సమస్యను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ టీడీపీ నాయకులు పేదల ఇళ్ల మంజూరుపై వేసిన కేసు సమస్య తీరిపోయిందని, మార్చిలో అందించే చర్యలు చేపడతామన్నారు. ప్రస్తుతం మరమతులు చేస్తున్నామన్నారు. తానే స్వయంగా పట్టాలు అందజేస్తానన్నారు. అనంతరం ఈ ప్రాంతంలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి,ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్,మాజీ కార్పొరేటర్, మానే దొరబాబు, గుడాల ఆదిలక్ష్మి, తిరగాటి దుర్గ, గుడాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వికాస్ సేవలు స్ఫూర్తిదాయకం

- నివ్యకళాశాల చైర్ పర్సన్ ఎలిజబెత్

రాజమహేంద్రవరం సిటీ: క్రమం తప్పకుండా ప్రతి నెలా పేద వృద్ధులకు వికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ పింఛన్లు అందించడం అభినందనీయమని నివ్య జూనియర్ కళాశాల చైర్ పర్సన్ గారపాటి ఎలిజబెత్ ప్రశంసించారు. శనివారం వికాస్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ వ్యవస్థాపకులు యార్లగడ్డ ప్రభాకర్ నేతృత్వంలో స్థానిక వీఎల్ పురంపార్కులో 100 మంది వృద్ధులు, 200 మంది దివ్యాంగులకు పింఛన్లను ఆమె చేతుల మీదుగా అందించారు. ఎలిజబెత్ మాట్లాడుతూ ప్రభాకర్ లెక్చరర్‌గా పని చేస్తూనే తన వంతు సామాజిక బాధ్యతగా తన జీతంలో కొంత భాగాన్ని పేద వృద్ధులకు, పేద విద్యార్థులకు కేటాయించడం స్ఫూర్తిదాయకమన్నారు. అంతేకాకుండా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఆయన అందరికీ ఆదర్శమని అన్నారు. వికాస్ వ్యవస్థాపకులు యార్లగడ్డ ప్రభాకర్ మాట్లాడుతూ తన జీతంలో 10 శాతాన్ని వృద్ధుల సేవకు వెచ్చిస్తున్నారన్నారు. వికాస్ సంస్థ అధ్యక్షురాలు రత్న జ్ఞానకుమారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యెనుములరంగబాబు, సోనీ, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పింఛన్లు అందజేస్తున్న ఎలిజబెత్

# పంట రుణాలపై ప్రత్యేక సమావేశం

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లాలో 2023–24 సంవత్సరానికి సంబంధించి వివిధ పంటల కింద స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయించడానికి జిల్లా స్థాయి టెక్నికల్ కమిటీ సమావేశం నిర్వహించినట్టు జిల్లా కలెక్టర్ మాధవీలత అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు అధ్యక్షతన కలెక్టర్ మాధవీలత వరి, ఇతర వాణిజ్య పంటల రుణాలపై వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. మాధవీలత మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ అనుబంధ రంగాల పంట రుణాలను నిర్ణయించామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల ద్వారా వరి, ఇతర వాణిజ్య పంటలు, మత్స్య, పశు సంవర్ధక, పట్టు పరిశ్రమ తదితర పంటలకు అందించే రుణాలపై సమావేశంలో చర్చించామన్నారు. డీసీసీబీ చైర్మన్ ఆకులు వీర్రాజు మాట్లాడుతూ జిల్లా స్థాయి సంబంధిత డిపార్టుమెంటు అధికారులు, నాబార్డు డీడీఎం జిల్లా సహకార అధికారి, బ్యాంకు అధికారులు, అభ్యుదయ రైతులు, ఎన్‌జీఓస్ ఇతర వాణిజ్య బ్యాంకు అధికారులతో చర్చించి, రుణ పరిమితులను నిర్ణయించామన్నారు. జిల్లాలో ప్రధాన పంటలు అయిన వరికి రూ.46వేలు, చెరుకు రూ.90వేలు, అరటి రూ.1,10,000, చిరుధాన్యాలు రూ.20వేలు, పసుపోషణ ఒక యూనిట్‌కు రూ.30వేలు, చేపల పెంపకానికి ఒక ఎకరానికి రూ.79వేలు నుంచి రూ.4,10,000తో పాటు మిగిలిన పంటలకు కూడా ఆయా ప్రాతిపదికన రుణ పరిమితులు నిర్ణయించామన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

## నగరంలో ట్రేడ్ లైసెన్స్ సొమ్ము పెంపు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో వ్యాపారులకు మున్సిపల్ చట్టం ప్రకారం ట్రేడ్ లైసెన్స్ పెంచినట్టు కమిషనర్ దిశేష్‌కుమార్ పేర్కొన్నారు. వ్యాపారుల ట్రేడ్ లైసెన్స్ కరోనా కారణంగా మూడు సంవత్సరాలుగా పెంచలేదని మున్సిపల్ చట్టం ప్రకారం 2023–24 ఆర్థిక సంవత్సరానికి ట్రేడ్ లైసెన్స్ పెంచామని, వ్యాపారులు గమనించాలని కోరారు.

## వైభవంగా 'ఆలయ నృత్య ఆరాధన'


ధనుర్మాస నృత్యారాధన చేస్తున్న దుర్గాప్రసాద్ శిష్య బృందం

రాజమహేంద్రవరం రూరల్: ఆలయ నృత్యం పునఃసృష్టి చేసి నాట్య రంగంలో రాజమహేంద్రవరానికి అంతర్జాతీయ ఖ్యాతినందించిన విఖ్యాత నాట్య పండితుడు డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో 39వ ధనుర్మాస నృత్యారాధన జరిగింది. శనివారం సాయంత్రం ధవళేశ్వరం వేంకటేశ్వర స్వామి సన్నిధిలో వైభవంగా నిర్వహించారు. తొలుత వైష్ణవాగమ శాస్త్రానుసారంగా 12 మంది సప్పా శిష్య బృందం నృత్యారాధనం, నృత్య పూజ, నృత్య విన్యాసాలు చేశారు. అనంతరం జరిగిన సభలో డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్‌ను ధర్మదాయ శాఖ ఆలయ కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు, మాజీ అధ్యక్షుడు సాధనాల చంద్రశేఖర్, ఆలయ అర్చకుడు వల్లభాచార్యులు, జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు యరమోతు ధర్మరాజు సత్కరించారు. కళాకారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు.

## వినియోగదారులకు ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): వినియోగదారుల వివాదాల పరిష్కారానికి ఇకపై ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ నంబర్ 1967ని సంప్రదించవచ్చని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి ప్రసాద్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 1967 ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ఈ నెల 10వ తేదీ నుంచి అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ అందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. రాష్ట్రంలోని ఫిర్యాదులన్నీ ఈ నంబర్ ద్వారా స్వీకరిస్తారన్నారు. అక్కడ నుంచి ఆయా జిల్లాలకు ఆ ఫిర్యాదులను పంపుతారని తెలిపారు. ప్రజలు ఈ కాల్ సెంటర్ ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థ, ధాన్యం సేకరణ, గ్యాస్ సిలిండర్, పెట్రోల్ బంకులు, తూనికలు కొలతలు తదితర వాటిపై ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.

## 'యువశక్తి'ని జయప్రదం చేయండి

సీటీఆర్ఐ: శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో ఈనెల 12వ తేదీన జరగనున్న యువశక్తి సభకు భారీగా ప్రజలు, అభిమానులు తరలిరావాలని జనసేన నాయకుడు అనుశ్రీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం యువశక్తి భారీ బహిరంగ సభ పోస్టర్‌ని ఆవిష్కరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో యువత ఆవేదనను ఈ సభ ద్వారా తెలియజేయనున్నట్టు తెలిపారు. నాగరాజు, గుత్తుల సత్యనారాయణ, వెంకట పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉన్నతే సీఎం జగన్ ఆశయం

- రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్
- శాటిలైట్‌సిటీలో నాడు–నేడు పనులకు శంకుస్థాపన

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి విద్య, వైద్యం రెండు కళ్లని, విద్యార్థుల ఉన్నతి ఆయన కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. శాటిలైట్‌సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో నాడు–నేడులో రెండో విడత కార్యక్రమంలో 12 అదనపు తరగతుల నిర్మాణానికి ఆయన, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు కూడా నాణ్యమైన కార్పొరేట్ పాఠశాలల స్థాయి విద్యా బోధన అందాలన్నదే సీఎం జగన్ సంకల్పమన్నారు. అందుకే ఆంగ్ల భాషా బోధన, విద్యార్థులలో ఆత్మన్యూనతా భావాన్ని తొలగించేందుకు అందరికీ యూనిఫారం, షూష్, టై, పుస్తకాలు, పాఠశాలల్లో ఫర్నీచర్, టాయ్ లెట్స్ ఇలా అన్నిటిపైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, అందుకోసం లక్షల కోట్లు వెచ్చిస్తున్నారని చెప్పారు. గతం కంటే ఇప్పుడు పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనంగా 12 తరగతి గదుల నిర్మాణానికి నాడు–నేడు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.44 కోట్లు మంజూరు చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ మాట్లాడుతూ శాటిలైట్‌సిటీ గ్రామంలో ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలన్న ఉద్దేశంతో ఈ ఏడాది నుంచి జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారన్నారు. నాడు–నేడు పథకం ద్వారా శాటిలైట్‌సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లాలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని చందన పేర్కొన్నారు. మండల విద్యాశాఖాధికారి తులసీదాస్, ప్రధానోపాధ్యాయిని బి.రాజరాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ నేతలు, స్కూలు పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


పాఠశాలలో తరగతి గదులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ భరత్‌రామ్, జెడ్పీచైర్మన్ విప్పర్తివేణుగోపాలరావు, చందన నాగేశ్వర్, మేడపాటి షర్మిలారెడ్డి



## ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు అల్‌కరాజ్ దూరం

సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌నుంచి వరల్డ్ నంబర్‌వన్, స్పెయిన్‌కు చెందిన కార్లోస్ అల్‌కరాజ్ తప్పుకున్నాడు. గత కొంత కాలంగా కుడి కాలి గాయంతో బాధపడుతున్న అతను సరైన సమయంలో కోలుకోకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించాడు. గత ఏడాది సెప్టెంబర్ 12న అల్‌కరాజ్ ఏటీపీ చరిత్రలో అతి పిన్న వయసులో వరల్డ్ నంబర్‌వన్‌గా నిలిచాడు. అల్‌కరాజ్ దూరం కావడంతో డిఫెండింగ్ చాంపియన్ రాఫెల్ నాదల్ ఈ టోర్నీలో టాప్ సీడ్‌గా బరిలోకి దిగనున్నాడు.

## పంత్ మోకాలికి శస్త్ర చికిత్స



కారు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న భారత క్రికెటర్ రిషభ్ పంత్‌కు ముంబైలో మోకాలి శస్త్రచికిత్స జరిగింది. డాక్టర్ దిన్షా పర్దీవాలా శుక్రవారం ఈ సర్జరీని నిర్వహించారని... ప్రస్తుతం పంత్ అబ్జర్వేషన్‌లో ఉన్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. అతని రీహాబిలిటేషన్ పూర్తి అయ్యే వరకు పర్దీవాలా తగిన సూచనలు ఇస్తారని, వాటిని బీసీసీఐ డాక్టర్ల పర్యవేక్షణలో అమలు చేస్తారని బోర్డు అధికారి చెప్పారు.

# మండే సూర్యుడు...

**సూర్యకుమార్ 51 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్సర్లతో 112 నాటౌట్**

- చివరి టి20లో 91 పరుగులతో శ్రీలంకపై భారత్ ఘనవిజయం
- 2–1తో సిరీస్ వశం


సూర్యకుమార్

**రాజ్‌కోట్:** సూర్యకుమార్ యాదవ్ విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆఖరి మ్యాచ్‌లో శ్రీలంక కొట్టుకుపోయింది. టీమిండియా 91 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2–1తో కైవసం చేసుకుంది. టాస్ నెగ్గిన భారత్ మొదట 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 228 పరుగుల భారీస్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్ (51 బంతుల్లో 112 నాటౌట్; 7 ఫోర్లు, 9 సిక్సర్లు) అజేయ సెంచరీ సాధించాడు. రాహుల్ త్రిపాఠి (16 బంతుల్లో 35; 5 ఫోర్లు, 2 సిక్సులు) మెరిశాడు. అనంతరం శ్రీలంక 16.4 ఓవర్లలో 137 పరుగులకే కుప్పకూలింది. కుశాల్ మెండిస్ (23), షనక (23) టాప్ స్కోరర్లు.

**సూర్య ది గ్రేట్ ఇన్నింగ్స్**

నాలుగో బంతికి ఇషాన్ కిషన్ (1) వికెట్ తీసిన లంకకు ఆ ఆనందం ఎంతో సేపు నిలవలేదు. కెరీర్‌లో రెండో మ్యాచ్ ఆడుతున్న రాహుల్ త్రిపాఠి మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగగా, శుబ్‌మన్ గిల్ (36 బంతుల్లో 46; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) మొదటి 9 బంతుల్లో సింగిల్ కూడా తీయలేకపోయాడు! తీక్షణ ఐదో ఓవర్లో 3 బౌండరీలు బాదిన త్రిపాఠి... కరుణరత్నే ఆరో ఓవర్లో వరుసగా రెండు సిక్సర్లు కొట్టాడు. అదే ఊపులో థర్డ్‌మ్యాన్ దిశగా షాట్ ఆడబోయి మదుషంక చేతికి చిక్కాడు. 'పవర్ ప్లే' ఆఖరి బంతికి సూర్య క్రీజులోకి వచ్చాడు. 6 ఓవర్ల పవర్ల ప్లేనే అయిపోయింది. మిగతా 14 ఓవర్ల పవర్ స్ట్రోక్స్ ఎలావుం టాయో 'స్కై' చూపెట్టాడు. కవర్ డ్రైవ్, ర్యాంప్ షాట్లతో టచ్‌లోకి వచ్చిన సూర్యకుమార్ స్కోరు బోర్డును ఆద్యంతం పరుగు పెట్టించాడు. స్పిన్, పేస్, గూగ్లీ ఇలా ఏ బంతి వేసిన తన శైలి షాట్లతో చెలరేగిపోయాడు. పేస్‌తో ముఖం మీదికి వచ్చే బంతుల్ని విడిచి పెట్టలేదు. అదే పనిగా ర్యాంప్ షాట్లతో సిక్సులు, ఫోర్లుగా దంచేస్తూ 26 బంతుల్లోనే ఫిఫ్టీని అవలీలగా పూర్తి చేసుకున్నాడు. అతని షాట్లకు ఆకాశమే హద్దయ్యింది. ఫుట్ టాస్ బంతుల్ని, యార్కర్ డెలివరీల్ని మంచినీళ్ల ప్రాయంలా బౌండరీలకు తరలించాడు. ఎలా వేసినా దంచేశాడు. అతని ధాటికి మదుషంక 13వ ఓవర్లో 18 పరుగులు రాగా... తీక్షణ మరుసటి ఓవర్లో 2, 4, 6, 6, 1లతో సూర్య వేగం ఇంకాస్త పెంచాడు. ఆఖరి బంతిని ఆడిన గిల్ బౌండరీ కొట్టడంతో ఆ ఓవర్లో 23 పరుగులొచ్చాయి. కేవలం ఈ రెండు ఓవర్లలోనే భారత్ 113/2 నుంచి 154/2కు చేరింది. హసరంగ 15వ ఓవర్లో గిల్ క్లీన్‌బౌల్డయ్యాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్యా (4), దీపక్ హుడా (4) స్వల్ప వ్యవధిలోనే నిష్క్రమించినా... సూర్య బాదుడుకు అదేమంతా ప్రభావమే చూపలేదు. ఆఖర్లో జతయిన అక్షర్ పటేల్ (9 బంతుల్లో 21 నాటౌట్; 4 ఫోర్లు) చకచకా బౌండరీలు బాదాడు.



18వ ఓవర్ చివరి బంతికి భారత్ స్కోరు 200కు చేరగా, 19వ ఓవర్ తొలి బంతికి సూర్యకుమార్ (45 బంతుల్లో; 6 ఫోర్లు, 8 సిక్సర్లు) సెంచరీ పూర్తయ్యింది. పొట్టి ఫార్మాట్‌లో అతనికిది మూడో సెంచరీ కావడం విశేషం.

**లంక గిలగిల**

భారీ లక్ష్యం చూడగానే శ్రీలంక బ్యాటర్స్ బెదిరినట్లున్నారు. క్రీజులోకి 11 మంది దిగినా... అందులో ఏ ఒక్కరు కనీసం పాతిక పరుగులైనా చేయలేకపోయారు. గత మ్యాచ్‌లో విమర్శలపాలైన భారత బౌలింగ్ ఒక్కసారిగా దెబ్బతిన్న పులిలా పంజా విసిరింది. నిసాంక (15; 3 ఫోర్లు), అవిష్క ఫెర్నాండో (1), ధనంజయ (14 బంతుల్లో 22; 2 ఫోర్లు, 1 సిక్స్), అసలంక (14 బంతుల్లో 19; 2 ఫోర్లు, 1 సిక్స్) కెప్టెన్ షనక, హసరంగ (9) ఎవరు వచ్చినా ఆడింది కాసేపే! భారీ లక్ష్యానికి తగ్గ భాగస్వామ్యం ఒక్కటంటే ఒక్కటైన నిలబడకుండా బౌలర్లు సమష్టిగా దెబ్బతీశారు. దీంతో కనీసం 17 ఓవర్లయినా పూర్తిగా ఆడలేక ఆలౌటైంది.

### స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** ఇషాన్ (సి) ధనంజయ (బి) మదుషంక 1; గిల్ (బి) హసరంగ 46; త్రిపాఠి (సి) మదుషంక (బి) కరుణరత్నే 35; సూర్యకుమార్ నాటౌట్ 112; హార్దిక్ (సి) ధనంజయ (బి) రజిత 4; హుడా (సి) హసరంగ (బి) మదుషంక 4; అక్షర్ నాటౌట్ 21; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 228.** వికెట్ల పతనం: 1–3, 2–52, 3–163, 4–174, 5–189. బౌలింగ్: మదుషంక 4–0–55–2, రజిత 4–1–35–1, తీక్షణ 4–0–48–0, కరుణరత్నే 4–0–52–1, హసరంగ 4–0–36–1.

**శ్రీలంక ఇన్నింగ్స్:** నిసాంక (సి) మావి (బి) అర్ష్‌దీప్ 15; మెండిస్ (సి) ఉమ్రాన్ (బి) అక్షర్ 23; ఫెర్నాండో (సి) అర్ష్‌దీప్ (బి) పాండ్యా 1; ధనంజయ (సి) గిల్ (బి) చహల్ 22; అసలంక (సి) మావి (బి) చహల్ 19; షనక (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 23; హసరంగ (సి) హుడా (బి) ఉమ్రాన్ 9; కరుణరత్నే (ఎల్బీ) (బి) పాండ్యా 0; తీక్షణ (బి) ఉమ్రాన్ 2; రజిత నాటౌట్ 9; మదుషంక (బి) అర్ష్‌దీప్ 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (16.4 ఓవర్లలో ఆలౌట్) 137.** వికెట్ల పతనం: 1–44, 2–44, 3–51, 4–84, 5–96, 6–107, 7–123, 8–127, 9–135, 10–137. బౌలింగ్: పాండ్యా 4–0–30–2, అర్ష్‌దీప్ 2.4–0–20–3, శివమ్ మావి 1–0–6–0, అక్షర్ 3–0–19–1, ఉమ్రాన్ 3–0–31–2, చహల్ 3–0–30–2.

# చేతన్ శర్మకే మళ్లీ చైర్మన్ పదవి

**భారత క్రికెట్ సీనియర్ సెలక్షన్ కమిటీని ప్రకటించిన బీసీసీఐ**



18 నవంబర్ 2022...పనితీరు బాగా లేదంటూ చేతన్ శర్మ నాయకత్వంలోని సెలక్షన్ కమిటీని రద్దు చేసి కొత్తగా దరఖాస్తులు కోరిన బీసీసీఐ...

7 జనవరి 2023... సెలక్టర్లలో ఒకడిగా ఎంపిక కావడమే కాదు... కమిటీ చైర్మన్‌గా చేతన్ శర్మ పునర్నియామకం...

**ముంబై:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఐదుగురు సభ్యుల కొత్త సీనియర్ సెలక్షన్ కమిటీని ప్రకటించింది. చేతన్ శర్మ (నార్త్‌జోన్) చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో సలీల్ అంకోలా (వెస్ట్), సుబ్రతో బెనర్జీ (ఈస్ట్), శివ్ సుందర్ దాస్ (సెంట్రల్), ఎస్.శరత్ (సౌత్‌జోన్) సభ్యులుగా ఉంటారు. టి20 ప్రపంచకప్‌లో భారత జట్టు వైఫల్యం అనంతరం బోర్డు రద్దు చేసిన కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించిన చేతన్ శర్మనే మరోసారి చైర్మన్ కావడం విశేషం. అయితే పేరుకు కమిటీ రద్దయినా...ఇదే బృందం న్యూజిలాండ్, బంగ్లాదేశ్ పర్యటనలకు, తాజాగా శ్రీలంకతో జరుగుతున్న సిరీస్‌కు కూడా జట్లను ఎంపిక చేసింది. టీమ్ పేలవ ప్రదర్శనపై జరిగిన సమీక్షా సమావేశంలో కూడా చేతన్ శర్మ పాల్గొన్నాడు.

**ఎంపిక జరిగిందిలా...**

సెలక్టర్ పదవి కోసం సుమారు 600 దరఖాస్తులు వచ్చినట్లు బీసీసీఐ ప్రకటించింది. అశోక్ మల్హోత్రా, జతిన్ పరాంజపే, సులక్షణా నాయక్ సభ్యులుగా ఉన్న బోర్డు క్రికెట్ అడ్వైజరీ కమిటీ ఇందులో అన్ని అర్హతలు ఉన్న 11 మందిని షార్ట్ లిస్ట్ చేసి జనవరి 1 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించింది. చైర్మన్‌గా గరిష్టంగా ఏడాదికి రూ. 1 కోటి వేతనం కావడంతో... ఇంతకంటే ఎక్కువగా ఆర్జిస్తున్న పలువురు మాజీ అగ్రశ్రేణి క్రికెటర్లు సెలక్టర్ కావడానికి ఇష్టపడటం లేదు.

**అనుభవమిదీ...**

చేతన్ భారత్ తరఫున 23 టెస్టులు, 65 వన్డేలు ఆడి 128 వికెట్లు పడగొట్టగా, సలీల్ అంకోలా 1 టెస్టు, 20 వన్డేలు ఆడి 15 వికెట్లు తీశాడు. 23 టెస్టులు, 4 వన్డేలు ఆడి 1375 పరుగులు చేసిన శివ్ సుందర్ దాస్ నేపథ్యం ఒడిషానే అయినా కెరీర్ చివర్లో విదర్భకు ఆడటంతో సెంట్రల్‌జోన్‌నుంచి అతని పేరును పరిగణలోకి తీసుకున్నారు. సుబ్రతో బెనర్జీ 1 టెస్టు, 6 వన్డేలు ఆడి 8 వికెట్లు పడగొట్టాడు. ఎస్.శరత్ ఒక్కడే అంతర్జాతీయ క్రికెట్ ఆడలేదు. అయితే దేశవాళీలో 139 మ్యాచ్‌ల ఘనమైన అనుభవంతో పాటు ఇటీవలి వరకు జూనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా పని చేయడం కూడా కలిసొచ్చింది.

## టాటా ఓపెన్ విజేత గ్రీక్‌స్పూర్



**పుణే:** భారత్‌లో నిర్వహించే ఏకైక ఏటీపీ టోర్నీ టాటా ఓపెన్ మహారాష్ట్ర (ఏటీపీ 250) శనివారం ముగిసింది. సింగిల్స్‌లో నెదర్లాండ్స్ ఆటగాడు గ్రీక్‌స్పూర్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో గ్రీక్‌స్పూర్ 4–6, 7–5, 6–3 స్కోరుతో బెంజమిన్ బోన్జి (ఫ్రాన్స్)ను ఓడించాడు. 2 గంటల 16 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో తొలి సెట్‌ను కోల్పోయినా...పట్టుదలతో ఆడిన 26 ఏళ్ల గ్రీక్‌స్పూర్ తన కెరీర్‌లో తొలి ఏటీపీ టైటిల్ సొంతం చేసుకోవడం విశేషం. మరో వైపు డబుల్స్‌లో భారత జోడి శ్రీరామ్ బాలాజీ – జీవన్ నెడుంజెళియన్ రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్లో సాండర్ గిల్ – జొరాన్ వీగన్ (బెల్జియం) ద్వయం 6–4, 6–4తో శ్రీరామ్–జీవన్‌లపై విజయం సాధించింది.

## దక్షిణాఫ్రికా 149/6

**సిడ్నీ:** ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లో దక్షిణాఫ్రికా పేలవ బ్యాటింగ్ ప్రదర్శన కొనసాగింది. మూడో టెస్టు నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి సఫారీ టీమ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. ఖాయా జోండో (39), తెంబా బవుమా (35) మాత్రమే ఫర్వాలేదనిపించారు. ఇప్పటికీ దక్షిణాఫ్రికా మరో 326 పరుగులు వెనుకబడి ఉంది. అయితే ఆసీస్ ఆధిపత్యం కనిపిస్తున్నా...టెస్టు 'డ్రా'గానే ముగియవచ్చు! చివరి రోజు ఆదివారం గరిష్టంగా వేయగలిగే 98 ఓవర్లలో మిగిలిన 14 దక్షిణాఫ్రికా వికెట్లను తీయడం ఆసీస్‌కు అంత సులువు కాదు. అంతకు ముందు వాన కారణంగా లంచ్ వరకు కూడా ఒక్క బంతీ పడలేదు. దాంతో ఓవర్‌నైట్ స్కోరు 475/4 వద్దనే తొలి ఇన్నింగ్స్‌ను ఆసీస్ డిక్లేర్ చేసింది. ఫలితంగా 195 పరుగులతో ఉస్మాన్ ఖాజా నాటౌట్‌గా నిలిచాడు. ఫ్రాంక్‌వారెల్ (197 నాటౌట్), సచిన్ (194 నాటౌట్) తర్వాత కెప్టెన్ ఇన్నింగ్స్ డిక్లేరేషన్‌తో 190ల్లో ఆగిపోయిన మూడో ఆటగాడిగా ఖాజా నిలిచాడు.

## సినిమా


● పొన్నియిన్ సెల్వన్


● ఆర్‌ఆర్‌ఆర్

# ఏషియన్ ఫిల్మ్ అవార్డుల్లో రెండు భారతీయ చిత్రాలు

- పొన్నియిన్ సెల్వన్‌కు ఆరు
- ఆర్‌ఆర్‌ఆర్‌కు రెండు

పదహారవ ఏషియన్ ఫిల్మ్ అవార్డ్స్‌కు సంబంధించిన నామినేషన్స్ శనివారం వెల్లడయ్యాయి. ఈ అవార్డుల్లో రెండు భారతీయ చిత్రాలు 'పొన్నియిన్ సెల్వన్ 1', 'ఆర్‌ఆర్‌ఆర్'కి నామినేషన్స్ దక్కాయి. మణిరత్నం దర్శకత్వం వహించిన 'పొన్నియిన్ సెల్వన్ 1' ఆరు విభాగాల్లో (బెస్ట్ ఫిల్మ్, బెస్ట్ ఒరిజినల్ మ్యూజిక్, బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్, బెస్ట్ ఎడిటింగ్, బెస్ట్ సినిమాటోగ్రఫీ, బెస్ట్ కాస్ట్యూమ్ డిజైన్) నామినేషన్స్ దక్కించుకుంది. విక్రమ్, 'జయం' రవి, కార్తీ, ఐశ్వర్యా రాయ్, త్రిష తదితరులు ముఖ్య తారలుగా ఈ సినిమా రెండు భాగాలుగా రూపొందింది. తొలి భాగం గత ఏడాది సెప్టెంబరు 30న విడుదలై, దాదాపు 500 కోట్ల గ్రాస్‌ను వసూలు చేసి బాక్సాఫీస్ రికార్డును సృష్టించింది. కాగా రెండో భాగం 'పొన్నియిన్ సెల్వన్ 2' ఈ ఏడాది ఏప్రిల్ 28న రిలీజ్ కానుంది. ఇక గత ఏడాది సంచలన విజయం సాధించిన 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా రెండు విభాగాల్లో (బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్, బెస్ట్ సౌండ్) నామినేషన్ దక్కించుకుంది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా 2022 మార్చి 25న విడుదలై బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ. 1300 కోట్ల గ్రాస్‌ను వసూలు చేసిందీ చిత్రం. ఇక ఈ 16వ ఏషియన్ ఫిల్మ్ అవార్డ్స్‌లో నామినేషన్ దక్కించుకున్నవారు అవార్డులూ అందుకుంటారా? అనేది మార్చి 12న తెలుస్తుంది. ఎందుకంటే ఆ రోజు హాంకాంగ్‌లో ఈ అవార్డుల వేడుక జరగనుంది.

**బాఫ్తా లాంగ్ లిస్ట్‌లో ఆర్‌ఆర్‌ఆర్**


95వ ఆస్కార్ అవార్డుల షార్ట్ లిస్ట్ (నాటు నాటు పాట), గోల్డెన్ గ్లోబ్ నామినేషన్స్.. ఇలా ఇప్పటికే పలు అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం మరో ఘనతను సాధించింది. 2023 బాఫ్తా (బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్) లాంగ్ లిస్ట్‌లో చోటు దక్కించుకుంది. నాన్ ఇంగ్లిష్ విభాగంలో 'ఆర్‌ఆర్‌ఆర్'కు చోటు దక్కింది. ఇదే విభాగంలో సౌత్ కొరియన్ ఫిల్మ్ 'డెషిసన్ టు లీవ్' ఉంది. ఇక ఈ బాఫ్తా లాంగ్ లిస్ట్ డాక్యుమెంటరీ జాబితాలో ఇండియాకు చెందిన 'ఆల్ దట్ బ్రీత్స్' కూడా ఉంది. ఈ ఏడాది జనవరి 19న బాఫ్తా నామినేషన్స్ రానున్నాయి. ఫిబ్రవరి 19న అవార్డుల ప్రదానం జరుగుతుంది. మరి... లాంగ్ లిస్ట్‌లో ఉన్న చిత్రాలు నామినేషన్ దక్కించుకుని, అవార్డు దక్కించుకుంటాయా అనేది చూడాలి.

**సౌత్ కొరియన్ మూవీకి 10 నామినేషన్లు**

16వ ఏషియన్ ఫిల్మ్ అవార్డ్స్‌లో సౌత్ కొరియన్ థ్రిల్లర్ 'డెషిసన్ టు లీవ్' చిత్రం 10 విభాగాల్లో (బెస్ట్ ఫిల్మ్, బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ స్క్రీన్‌ప్లే, బెస్ట్ యాక్టర్, బెస్ట్ యాక్ట్రస్, బెస్ట్ సినిమాటోగ్రఫీ, బెస్ట్ ఎడిటింగ్, బెస్ట్ ఒరిజినల్ మ్యూజిక్, బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్, బెస్ట్ సౌండ్) నామినేషన్స్ దక్కించుకుంది. ఇదే సినిమా 95వ ఆస్కార్ అవార్డుల్లో ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీలో షార్ట్ లిస్ట్ కావడం మరో విశేషం. అంతే కాదు.. ఈ ఏడాది కేన్స్ చిత్రోత్సవాల్లో బెస్ట్ డైరెక్టర్ అవార్డును ఈ చిత్రదర్శకుడు పార్క్ చాన్ వూక్ అందుకున్నారు.

# అయ్యో ఏంటో ...


సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ జంటగా అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వం వహించిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. శ్రవణ్ భరద్వాజ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'అయ్యో ఏంటో నాకు' అనే లిరికల్ పాటను శనివారం విడుదల చేశారు. ఈ పాటకు కృష్ణకాంత్ సాహిత్యం అందించగా, స్వీకర్ అగస్తి పాడారు. ''పెళ్లి నేపథ్యంలో సాగే ఆహ్లాదకర కథతో నూతన దర్శకుడు అనిల్ కుమార్ ఈ చిత్రం రూపొందించారు. సంక్రాంతి పండగకి వస్తున్న మా చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.


● సంతోష్

# ఆ ఇద్దరిలా నేనూ సపోర్ట్ లేకుండా వచ్చా!

**- దర్శకుడు బాబీ**

"చిరంజీవిగారి జడ్జిమెంట్ పక్కాగా ఉంటుంది. 153 సినిమాలు చేసిన అనుభవం ఆయనది. అలాంటి చిరంజీవిగారు నేను చేసిన 'వాల్తేరు వీరయ్య' ఫైనల్ కాపీ చూస్తున్నారన్నప్పుడు రెండు రాత్రులు నిద్రపట్టలేదు. సినిమా చూశాక చిరంజీవిగారు నన్ను హత్తుకుని 'బ్లాక్ బస్టర్ కొడుతున్నాం బాబీ' అన్నారు.. ఆ మాటతో గర్వంగా ఫీలయ్యాను" అని డైరెక్టర్ బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా రవితేజ కీలక పాత్రలో నటించిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న రిలీజ్ కానున్న సందర్భంగా బాబీ చెప్పిన విశేషాలు.



● చిరంజీవిగారికి ఒక ఫ్యాన్ బాయ్‌గా 2003లో నా ప్రయాణం మొదలైంది. ఆయన సినిమాలో ఏదో ఒక విభాగంలో పని చేయాలనే కల ఉండేది. అలాంటిది మెగాస్టార్‌ని నేను డైరెక్ట్ చేసిన 'వాల్తేరు వీరయ్య' విడుదలవుతుండటం నా జీవితంలో స్పెషల్ మూమెంట్. ప్రెస్‌మీట్‌లో చిరంజీవిగారు నన్ను కౌగలించుకొని ముద్దు పెట్టుకున్న ఫోటోని ఫ్రేమ్ కట్టించుకుని ఇంట్లో, ఆఫీసులో పెట్టుకున్నా. ● 'వాల్తేరు వీరయ్య' కథని లాక్‌డౌన్‌కి ముందు చిరంజీవిగారికి చెప్పాను. అయితే లాక్‌డౌన్‌లో ప్రేక్షకులు ఓటీటీకి, డిఫరెంట్ కంటెంట్‌కి అలవాటు పడ్డారు. ఈ క్రమంలో అందర్నీ అలరించే కథ చెప్పాలని దృష్టి పెట్టాం.. ఆ ఆలోచనల నుంచి రవితేజగారి పాత్ర పుట్టింది. ఇద్దరి పాత్రలని సమానంగా డిజైన్ చేశాను. బీ, సీ సెంటర్ ఆడియన్స్‌తో పాటు మల్టీప్లెక్స్ ప్రేక్షకులని కూడా అలరించే అన్ని వాణిజ్య అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి. ● చిరంజీవిగారు హిట్‌కి పొంగిపోరు.. ఫ్లాప్‌కి నిరుత్సాహపడరు. రవితేజగారూ అంతే. ఏ సినిమాకైనా ఇద్దరూ ప్రాణం పెట్టి చేస్తారు. ఎలాంటి నేపథ్యం లేకుండా స్వయంకృషితో ఎదిగిన చిరంజీవి, రవితేజగార్లలా నేను కూడా ఏ సపోర్ట్ లేకుండా ఇండస్ట్రీకి వచ్చాను. వాళ్లిద్దరితో సినిమా చేయడం నా అదృష్టం. ● సంక్రాంతికి పోటీ ఉంటుంది.. వేరే నిర్మాతలు అయితే ఒత్తిడి ఉండొచ్చేమో? అయితే నవీన్, రవిగార్లు కావడంతో ఒత్తిడి లేదు. 'వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి' చిత్రాలకు నిర్మాతలు ఒక్కరే కాబట్టి రెండు సినిమాలూ బాగుండాలని పాజిటివ్‌గా ఎదురు చూస్తున్నాం. గోపీచంద్ డైరెక్టర్‌గా, నేను రచయితగా ఇద్దరం చాలా కాలం ప్రయాణం చేశాం. మేమిద్దరం ఒకే బ్యానర్‌లో రెండు చిత్రాలతో సంక్రాంతికి రావడం హ్యాపీగా ఉంది. ఒకరికొకరం ఆల్ ది బెస్ట్ చెప్పుకున్నాం. ● చిరంజీవిగారిని అభిమానించే ఫ్యాన్స్ రవితేజగారిని కూడా అభిమానిస్తారు. చిరంజీవిగారి స్ఫూర్తితో ఈ స్థాయికి ఎదిగానని రవితేజగారు ఎన్నో సార్లు చెప్పారు. సైడ్ క్యారెక్టర్స్ చేసుకునే రవితేజగారు స్టార్ హీరోగా ఎదగడం చిరంజీవిగారికి కూడా ఆనందమే. ఇద్దరికీ హిందీలో మంచి మార్కెట్ ఉంది కాబట్టే ఈ చిత్రాన్ని బాలీవుడ్‌లోనూ రిలీజ్ చేస్తున్నాం.

# త్రిష కాదు.. కాజల్?

అజిత్ అరవైరెండో సినిమాలో కథానాయిక ఎవరు? కొన్ని రోజులుగా చెన్నై కోడంబాక్కమ్‌లో జరుగుతున్న చర్చ ఇది. ముందుగా నయనతార పేరు వినిపించింది. ఆ తర్వాత త్రిష పేరు తెరపైకి వచ్చింది. ఇప్పుడు కాజల్ అగర్వాల్ పేరు ప్రచారంలోకి వచ్చింది. అజిత్ 62వ చిత్రానికి విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించనున్నారు. ఇందులో అజిత్ సరసన హీరోయిన్, విఘ్నేష్ భార్య నయనతార నటిస్తారనే ప్రచారం జరిగింది. కారణాలు బయటకు రాలేదు కానీ నయనతార నటించడంలేదట. ఆ తర్వాత త్రిషను సంప్రదించాలనుకున్నారని సమాచారం. అయితే త్రిష కూడా కాదట. కాజల్ అగర్వాల్‌ని ఫైనలైజ్ చేసే ఆలోచనలో యూనిట్ ఉందని సమాచారం. తల్లయ్యాక కాజల్ కొంత బ్రేక్ తీసుకుని, ఇప్పుడు మళ్లీ షూటింగ్స్ చేయడానికి రెడీ అయ్యారు. ప్రస్తుతం కమల్‌హాసన్‌తో ఆమె 'ఇండియన్ 2' చేస్తున్నారు. ఇక గతంలో అజిత్ సరసన కాజల్ 'వివేకం' (2017)లో నటించారు. సో.. మరోసారి ఈ జోడీ కుదురుతుందా? కొన్ని రోజుల్లో తెలిసిపోతుంది.



# కొత్తవారిని ప్రోత్సహించాలి

**- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



''తెలుగు సినిమా పరిశ్రమకు కొత్త తరం అవసరం చాలా ఉంది. కొత్తవారు చేస్తున్న ఈ 'అష్టదిగ్బంధనం' సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను. ఎందుకంటే కొత్తవారు చేస్తున్న ప్రయత్నాన్ని ప్రోత్సహించినప్పుడే మరిన్ని కొత్త సినిమాలు వస్తాయి'' అని తెలంగాణ సినిమాటోగ్రఫీ మినిస్టర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సూర్య భరత్ చంద్ర, ఇషికా ముఖ్య తారలుగా బాబా పీఆర్ దర్శకత్వంలో మనోజ్ కుమార్ అగర్వాల్ నిర్మిస్తున్న చిత్రం 'అష్టదిగ్బంధనం'. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విడుదల చేశారు. మనోజ్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ – ''ఈ చిత్రం ద్వారా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచనున్నాం. ఒక వినూత్న కథాంశంతో బాబా పీఆర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే 80 శాతం షూటింగ్ పూర్తయింది'' అన్నారు. ''హైదరాబాద్ నేపథ్యంలో సాగే హై వోల్టేజ్ యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ ఇది'' అని బాబా పీఆర్ అన్నారు. ''నటనకు అవకాశం ఉన్న పాత్ర చేస్తున్నాను'' అన్నారు సూర్య భరత్ చంద్ర. ''తెలుగులో నాకు ఇది మూడో సినిమా'' అన్నారు ఇషికా.

# సంగీత దర్శకుడు చాంద్ బాషా మృతి



నృత్యదర్శకురాలు సుచిత్ర తండ్రి, గేయ రచయిత చంద్రబోస్ మామ, సంగీత దర్శకుడు చాంద్ బాషా (92) మృతి చెందారు. హైదరాబాద్ మణికొండలోని ఆయన స్వగృహంలో శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. చాంద్ బాషా దక్షిణాదిలో పలు సినిమాలకు సంగీత దర్శకునిగా చేశారు. తెలుగులో 'ఖడ్గ తిక్కన, బంగారు సంకెళ్లు, స్నేహమేరా జీవితం, మానవుడే దేవుడు', కన్నడంలో 'అమర భారతి, చేడిన కిడికి' వంటి పలు చిత్రాలకు స్వరాలందించారాయన. చాంద్ బాషాకి ముగ్గురు అమ్మాయిలు, ఒక కొడుకు ఉన్నారు. వారిలో సుచిత్ర కొరియోగ్రాఫర్‌గా, డైరెక్టర్‌గా (2004లో 'పల్లకిలో పెళ్లికూతురు' సినిమా తెరకెక్కించారు) సుపరిచితమే. జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో శనివారం ఉదయం చాంద్ బాషా అంత్యక్రియలు జరిగాయి. కాగా ఆయన మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.